# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

## బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి



ఎస్‌బీహెచ్ కాలనీలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సునరితారెడ్డి

మలక్‌పేట, అక్టోబర్ 5 : అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న పార్టీకి అండగా నిలిచి మరోసారి అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. 50 ఏండ్లలో జరగని అభివృద్ధిని తొమ్మిదేండ్లలో చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దని ఆయన అన్నారు. గురువారం ఎస్‌బీహెచ్ కాలనీలో పార్టీ నాయకుడు పొట్టేలు నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో లక్ష్మీనగర్, శాలివాహననగర్, ఎస్‌బీహెచ్ కాలనీవాసులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనిచేసే పార్టీని ఆదరించాలని, మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థిగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపరచి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. మలక్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరాలంటే మీ అందరి సపోర్టు ఎంతో అవసరమన్నారు. పనిచేసే పార్టీని ఆదరించి అండగా నిలవాలని, ఒక్కసారి తనకు అవకాశమిస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని పేర్కొన్నారు. కాలనీవాసులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధిపై సమీక్షించుకోవాలని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ అజిత్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సునరితారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, కాలనీవాసులు శంకర్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, నాగరాజు, ప్రవీణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు మలక్‌పేటలో ఉచిత వైద్య శిబిరం

సైదాబాద్, అక్టోబర్ 5 : మలక్‌పేట దత్తకుమార్ క్లినిక్ శ్రీనివాస మెడికల్ షాపు ఆవరణలో శనివారం ఉదయం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ రూమటాలాజీ వైద్య నిపుణులు డాక్టర్ దత్తకుమార్, డాక్టర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో యూరిక్ యాసిడ్ టెస్ట్, ఉచిత నరాల పటిష్ట పరీక్షలు వంటి అనేక పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేయనున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

## ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్స్ జారీ చేయాలి

సైదాబాద్, అక్టోబర్ 5 : దళిత పథకం ఎంపికైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్స్‌లో జారీలో సైదాబాద్ మండల అధికారులు తాత్సారం చేస్తూ కాలయాపన చేస్తున్నారని యాకుత్‌పురా నియోజకవర్గం సివిల్ సప్లై మెంబర్ నాగిళ్ల రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కార్యాలయంలో సకాలంలో ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్స్ ఇవ్వకపోవటంతో డబుల్ బెడ్రూం ఇండ్లను పొందిన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డబుల్ బెడ్రూం లబ్ధిదారులు తమ కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్స్ కలెక్టర్ కార్యాలయంలో సమ్మిట్ చేయాల్సి ఉందని, అప్పుడే ప్రభుత్వం కేటాయించిన ఇండ్ల తాళాలు ఇస్తుండటంతో చాల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఎంతోగాను అభివృద్ధి పథకాల్లో అవకాశాలను కల్పిస్తుందని, అయితే కిందిస్థాయి అధికారులు దళితులు ప్రభుత్వ పథకాలను లబ్ధిపొందకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలిపారు. అదే విధంగా డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ స్థానాల్లో మైనార్టీలకు కేటాయించిన ఇళ్లను రద్దు చేసి నిరుపేద దళితులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయింపులు పారదర్శకంగా ఎన్ఐసీ ద్వారా రాండమేషన్ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తూ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు త్వరితగతిన ఇచ్చే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ

సైదాబాద్, అక్టోబర్ 5 : బతుకమ్మ ఉత్సవాలు, దసరా పండుగలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బతుకమ్మ చీరలను గురువారం సైదాబాద్, ఐఎస్ సదన్ డివిజన్ల కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ, జంగం శ్వేత మహిళలకు అందజేశారు. సైదాబాద్ మహిళా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతినగర్, ఎస్ఎన్ రెడ్డినగర్, సాయి నగర్ కాలనీలో జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ జంగం శ్వేత పాల్గొని కాలనీవాసులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ బన్సీలాల్, జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్ యూసీడీ ప్రాజెక్టు అధికారి యుగంధర్, సీవో రవి, సంతోష్‌నగర్ సర్కిల్ యూసీడీ విభాగం సీవో యాదయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



సైదాబాద్ మహిళా భవన్‌లో బతుకమ్మ చీరలను మహిళలకు అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ తదితరులు

## 'డబుల్' లబ్ధిదారులకు అభినందనలు



సైదాబాద్, అక్టోబర్ 5 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులో ఎంపికైన లబ్ధిదారులు గురువారం ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణికాలనీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు. లబ్ధిదారులకు బస్సుకు యాకుత్‌పురా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సొంత గూడును కల్పించటమే లక్ష్యంగా పెట్టుకుందని, ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సామ స్వప్నాసుందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, నర్సింగ్‌రావు, కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టింటికెళ్లిన భార్య.. హైటెన్షన్ స్తంభం ఎక్కిన భర్త

### టవర్‌పై గంటకుపైగా మందుబాబు హల్‌చల్

సైదాబాద్, అక్టోబర్ 5 : పుట్టింటికి వెళ్లిన భార్యను తీసుకొని రావాలంటూ మద్యంమత్తులో ఓ భర్త తన భార్య కోసం హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. గురువారం మధ్యాహ్నం సైదాబాద్ శంకేశ్వరబజార్ చౌరస్తాలోని పెట్రోల్ పంప్ వద్ద చోటు చేసుకున్నది. సైదాబాద్ సింగరేణికాలనీకి చెందిన మోహన్‌బాబు (35) మద్యానికి అలవాటుపడి ఎటువంటి పనులు చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. తాగిన మత్తులో అతడు తరుచూ భార్యతో ఘర్షణ పడుతుండటంతో ఆమె వేధింపులు భరించలేక పుట్టింటికి వెళ్లింది. భార్య వెళ్లిపోవడంతో మనస్థాపంతో మద్యం మత్తులో హైటెన్షన్ విద్యుత్ టవర్‌ను ఎక్కి దూకుతానంటూ బెదిరించాడు. గమనించిన స్థానికులు, వాహనదారులు సైదాబాద్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. తన భార్యను ఇక్కడికి తీసుకొచ్చేంత వరకు టవర్‌పై నుంచి దిగేదిలేదని భీష్మించి గంటకు పైగా పైనే కూర్చున్నాడు. దీంతో పోలీసులు సింగరేణికాలనీలో ఉన్న భార్యను అక్కడికి తీసుకొచ్చి మోహన్‌బాబుకు చూపించి సముదాయించి కిందకు దించటంతో పెద్ద ప్రమాదం తప్పింది. అతడిని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడంతో రోడ్డుపై స్తంభించిపోయిన ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయటానికి పోలీసులు అష్టకష్టాలు పడ్డారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.



మద్యం మత్తులో హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేసిన మోహన్‌బాబు

## డ్రైనేజీ, రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలి

### మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



సైదాబాద్ వెంకటాద్రినగర్‌లోని కోణార్క్ డయోగ్నోస్టిక్ సెంటర్ సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ అరుణ తదితరులు

మలక్‌పేట, అక్టోబర్ 5 : మూసారాంబాగ్ డివిజన్‌లోని రాజరాజేశ్వరీ ఆలయం ముందు డ్రైనేజీ, రహదారి నిర్మాణాన్ని దేవీ నవరాత్రులు ప్రారంభమయ్యే లోపుగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల ఇంజనీరింగ్, మెట్రో వాటర్‌వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులను ఆదేశించారు. గురువారం డివిజన్‌లోని సాయినగర్, మూసారాంబాగ్ కాలనీల్లో పర్యటించిన ఆయన స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. దేవీ నవరాత్రులు త్వరలో ప్రారంభం కానున్నాయని, ఆలయం ముందు డ్రైనేజీ లైన్ పాడై నిత్యం మ్యాన్‌హోళ్లు పొంగుతూ ఆలయ పరిసరాలు దుర్గంధభరితంగా తయారవటంతో ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, ఉత్సవాలు ప్రారంభమయ్యే లోపుగా ఈ సమస్యను పరిష్కరించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు, సభ్యులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆలయ కమిటీ సభ్యులు కోరిన విధంగా సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రదీప్, మెట్రో వాటర్‌వర్క్స్ అండ్ సీవరేజీ బోర్డు మలక్‌పేట డివిజన్ డీజీఎం ఇంద్ర శీలారాణి, మేనేజర్ చంద్రు నాయక్, రాజరాజేశ్వరీ ఆలయ కమిటీ అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రావు, సభ్యులు నర్సింహ, జంగారెడ్డి, జంగం, డివిజన్ నాయకులు ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీవాసుల సమస్యలను పరిష్కరిస్తా

సైదాబాద్, అక్టోబర్ 5 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. గురువారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.74 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసి వీడీసీసీ, సీసీరోడ్లు, 26 లక్షల వ్యయంతో వెంకటాద్రినగర్‌లో ఏర్పాటుచేసే సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ, బస్తీలల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను ఆధునీకరణ చేసి, ఆయా ఆ ప్రాంతాల్లో కొత్తగా వీడీసీసీ, సీసీ రోడ్లు వేశామని తెలిపారు. కల్యాణ్‌నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్, సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలో ప్లే గ్రౌండ్‌లను ఆధునీకరణ పనులను పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. పూసలబస్తీలో ప్రతి ఇంట్లో ఒక్కరికీ కుట్టు మిషన్లను పంపిణీ చేస్తానని, అదే విధంగా బీసీ పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొరుడు భూమేశ్వర్, కొత్తకాపు రవీందర్ రెడ్డి, వినోద్, సుమంత్, నాగరాజ్, జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్ డీజీ బన్సీలాల్, ఏఈ వెంకన్న, ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, జలమండలి డీజీఎం షీలారాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహార్, శ్రీనివాస్, పలు కాలనీలకు చెందిన స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ జిమ్‌లను కేటాయించాలి

సైదాబాద్, అక్టోబర్ 5 : సైదాబాద్ డివిజన్ పరిధిలోని హమాలీబస్తీ, హరిజన బస్తీల్లో మోడల్ జిమ్‌లను కేటాయించాలని కోరుతూ సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ గురువారం జీహెచ్ఎంసీ సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను పాతబస్తీలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి ప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బస్తీ యువతకోసం మోడల్ జిమ్‌లను కేటాయించటం ద్వారా స్థానిక యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

## బీటీ రోడ్లకు మరమ్మతులు



నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ జెడ్ కేఫ్ చౌరస్తా వద్ద రోడ్ల గుంతలకు జీహెచ్ఎంసీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. గుంతలను బీటీతో పూడ్చి వేశారు. వర్షాల కారణంగా ప్రధాన రోడ్లు, చౌరస్తాల వద్ద బీటీ రోడ్లకు గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు ఫిర్యాదులు చేయడంతో అధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించారు. – మెహిదీపట్నం, అక్టోబర్ 5